



# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 14, 2026 | సంపుటి : 2 | సంచిక : 242 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

♦ విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,జూన్13 :**
భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.



2 లో

## ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

♦ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం
♦ మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి

**మంచిర్యాల,జూన్13 :**
కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



2 లో

## వర్క్ ఫ్రమ్ బైక్..

### అంత ఆత్రుత ఎందుకు: సజ్జనార్ పోస్ట్

రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే.. కొందరు ఐటీ ఉద్యోగులు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం అప్పుడప్పుడు మనం చూస్తూనే ఉంటాం.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

## పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం

♦ అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్ ♦ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

**హైదరాబాద్,జూన్13 :**
హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర



చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

♦ 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు
♦ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
♦ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



**మంచిర్యాల,జూన్13 :**
మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..

మిగతాద్ది 2 లో

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

▪ ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ ▪ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

**హైదరాబాద్,జూన్13 :**
మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి



నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. 2023 ఎన్నికల సమయంలో మంత్రి తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు అధికారులు గుర్తించారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల్ని కూడా సిట్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసు తర్వాత సిట్‌కు బదిలీ అయింది.తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు జరిగిన తర్వాత.. అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (SIB) లో పనిచేసిన కొందరు అధికారులు కీలక డేటాను తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును ప్రత్యేక విచారణ బృందం దర్యాప్తు సాగిస్తోంది. ఈ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నివాసానికి వెళ్లిన అధికారులు.. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

## సింగరేణిలో 'బొగ్గు మాయం'పై విచారణ జరిపించండి.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్:**
సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. "సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి.



మిగతాది 2లో

## నా మీద ఉన్న కోపం నేతన్నల మీద చూపించొద్దు: కేటీఆర్

**సిరిసిల్ల:**
తన మీద ఉన్న కోపం సిరిసిల్ల నేతన్నల మీద చూపించొద్దని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నో పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. స్థానిక నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు రద్దు చేసిందన్నారు. సిరిసిల్లలో ఉన్నవి



చిన్న కుటీర పరిశ్రమలని చెప్పారు. "రైతుల ధాన్యం కొనేందుకు రాష్ట్రంలో కనీసం గన్నీ సంచులు లేవు. ఉన్న బ్యాగులన్నీ రాహుల్ గాంధీకి డబ్బులు పంపేందుకు ఢిల్లీకి వెళ్లాయని అంటున్నారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు 900 రోజులైనా నెరవేర్చలేదు. హామీల గురించి ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరైనా.. కేసీఆర్‌ను మాత్రమే చూడాలి. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉంది" అని కేటీఆర్ అన్నారు.

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

▪ కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క
▪ పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి



**హైదరాబాద్,జూన్13 :**
కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

మిగతాద్ది 2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 14, 2026

## వీబీజీ రాంజీ స్కీం పట్ల
# ప్రభుత్వ నిరసన

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## వర్క్ ఫ్రమ్ బైక్..
### అంత ఆత్రుత ఎందుకు: సజ్జనార్ పోస్ట్

మొదటి పేజీ తరువాయి
అలా హైదరాబాద్‌లో ఓ యువకుడు బైక్‌పై వెళ్తూ.. ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ కాగా.. దీనిపై తాజాగా సీపీ సజ్జనార్ స్పందించారు. రోడ్డుపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన పనులు మానుకోవాలని హితవు పలికారు.
వీడియోను సజ్జనార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. “ఏ పనికైనా ఓ పద్ధతి ఉంటుంది. కానీ, ప్రాణాలను పణంగా పెట్టి ఇలా వర్క్ ఫ్రమ్ బైక్ నిలచేయడం చూస్తుంటే.. ‘ఆత్రుత ఎక్కువైతే ప్రాణం మీదకు వస్తుందనే మాట’ నిజమనిపిస్తోంది. రోడ్డుపై ఒక్కక్షణం ఏకాగ్రత తప్పినా అది మీ ప్రాణానికే ప్రమాదం. పక్కన వెళ్లే అమాయకులకు కూడా ప్రమాదకరం. కడుపు నింపుకోవడానికి చేసే పని.. కడతేర్చేలా ఉండకూడదని గుర్తుపెట్టుకోండి. రోడ్డుపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన పనులు మానుకోండి. సురక్షితంగా ప్రయాణించి.. గమ్యస్థానాలకు చేరుకోండి” అని ఆయన రాసుకొచ్చారు.

## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

మొదటి పేజీ తరువాయి
సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల పక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మొదటి పేజీ తరువాయి
మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో
భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## సింగరేణిలో ‘బొగ్గు మాయం’పై విచారణ జరిపించండి.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

మొదటి పేజీ తరువాయి
ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలి” అని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

## 26న యాంటీ డ్రగ్ 3కే రన్
### కరపత్రాన్ని ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 న నిర్వహించనున్న ‘యాంటీ డ్రగ్ 3కే రన్‘ కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రన్ స్ట్రాంగ్ లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు..డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చింది. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.

## యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా

యూరియా యాప్ బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ధర్మోరా గ్రామంలోని వ్యవసాయ గిడ్డంగికి తాళం వేసి, గిడ్డంగి ముందు టెంట్ వేసుకుని 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని గిడ్డంగిలో యూరియా ఉన్నా యాప్ లో తమకు బుక్ కాకుండా ఇతర గ్రామాల్లోని రైతులకు బుక్ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయ అధికారి హరీష్ గిడ్డంగి కి వేసిన తాళం తీయాలని కోరగా రైతులు అందుకు అంగీకరించలేదు. తమ గ్రామంలో ఉన్న యూరియా సంచులు తమకే ఇవ్వాలని లేదంటే గిడ్డంగి తాళాలు తీసేదే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బిర్యానీ తిన్న వైద్య విద్యార్థులకు అస్వస్థ
### ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు గుర్తింపు

నగరంలోని సిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని నగరంలో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్) చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. అనంతరం సరదా గా 12 మంది కవిత థియేటర్ సమీపం లో ని ఓ హోటల్ లో విందు భోజనానికి వెళ్లి మండీ బిర్యానీ ఆరగించాచి తిరిగి ఎవరి రూమ్ లకు వారు వెళ్లి పోయారు. ఇందులో 12 మంది విద్యార్థులలో 11 మంది కి ఫుడ్ ఫాయిజన్ అయింది. దీంతో అందరికీ వాంతులు విరోచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని గోదావరిఖనికి లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే 8 మందికి తీవ్ర, ముగ్గురికి స్వల్పంగా అస్వస్థత కు లోనయినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం వారిని వైద్యుల సలహా మేరకు డిశ్చార్జ్ చేశారు. అయితే హోటళ్లలో నాణ్యతను పరీశీలంచాల్సిన అధికారులు ఇంత జరిగినా పత్తా లేకపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

## భారీ వర్షానికి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు
### రాకపోకలకు తీవ్ర అంతరాయం

నిజామాబాద్ జిల్లా లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్డుపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన వివరాలను శనివారం రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ వెల్లడించారు. సాయంత్రం నుండి భారీగా ఈదురు గాలులు వీచాయి. దీంతో పాటు వర్షం కూడా పడడంతో నిజామాబాద్ మండల పరిధిలోని ఖానాపూర్ రోడ్డులో రాత్రి సమయంలో ఓ భారీ వృక్షం విరిగిపోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆ రోడ్డు వెంబడి రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపారు. అయితే రోడ్డుపై పడిన చెట్టును తొలగించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విషయం తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్లి రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టును పెట్రోలింగ్ సిబ్బంది రోడ్డుపై నుండి తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకల అంతరాయం తొలగిపోయింది

## గిరిజన సంప్రదాయాలపై పేపర్ ప్రజెంటేషన్
### రీసెర్చ్ స్కాలర్ రాజేంద్రపప్రసాద్‌కు సన్మానం

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్వహించిన 'గిరిజన జీవితం, సాంప్రదాయాలు, గతానుభవాలు, అంతర్‌దృష్టులు, దూరదృష్టి' అంశంపై ఈ 12, 13 తేదీల్లో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్, సమక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబ్బయ్య చారి హాజరయ్యారు. ఈ సెమినార్‌లో బూర్గంపహాడ్ మండల పరిధిలోని కోయగూడెంకు చెందిన ట్రైబల్ రీసెర్చ్ ఫెలో పాయం రాజేంద్రప్రసాద్ పాల్గొని 'కోయ గిరిజనుల ప్రాచీన ఆహారపు అలవాట్లు' అంశంపై రాసిన వ్యాసాన్ని సమర్పించారు. ఈ సెమినార్‌లో ఆ వ్యాసం పలువురు ప్రముఖుల నుండి అభినందనలు అందుకోగా రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి
### పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ డిమాండ్

భువనగిరి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు అన్ని పూర్తయిన నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని, నెల రోజుల్‌లో ప్రారంభించకుంటే వీధి వ్యాపారులతో ప్రారంభం చేయిస్తామని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి.కిరణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను శనివారం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏవి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారస్తులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను అన్ని వసతులతో నిర్మించడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం గడిచిపోయిన ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వీధి వ్యాపారులకు శాపంగా మారిందన్నారు. నిర్మించిన భవనంలోని ఎలక్ట్రికల్ వైర్లు, ప్రహారికి నిర్మించిన గ్రిల్స్ ను కట్ చేసి దొంగలించిన వస్తువుల విలువ సుమారూ రూ.25 లక్షలని మున్సిపల్ కమిషనర్, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దర్యాప్తునకు నోటుకోలేదన్నారు. భువనగిరి ఎమ్మెల్యే అతడి క్యాంప్ కార్యాలయ ఆవరణలోనే ఉన్నా కూడా మార్కెట్‌ను పరిశీలించకపోవడం, దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తూ ఉంటే భువనగిరి పట్టణంపై అతనికి ఉన్న ప్రేమ నామ మాత్రమే అని పట్టణ ప్రజలకు అనిపిస్తుందన్నారు.

## ఆదర్శ రైతు సాయినికి ఉత్తమ రైతు అవార్డు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదర్శ రైతు సాయిని మధుసూదన్ రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ విశ్వవిద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సాయిని మధుసూదన్ రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే ‘రైతులకు నేస్తం‘ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేయనున్న కొత్త వంగడాలు, చిరుధాన్య పంటల సాగు విధానాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను తన పొలంలో అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

## పాఠశాలల కుదింపునకు నిరసన

**– 15న డైరెక్టరేట్ ఎదుట ధర్నాకు పిడిఎస్‌యు పిలుపు**

కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల కుదింపునకు నిరసనగా ఈనెల 15న ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ముందుఏ మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఉన్న పాఠశాలలను కుదించడం అన్యాయమని అన్నారు. ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్లు, సరైనా బిల్డింగ్స్?, కనీస సమస్యలను ఏమాత్రం మెరుగుపరుచకుండా 4 వేల పాఠశాలలకు కుదించడం పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేయడమే నన్నారు. ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చి కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలను పెంచి పోషించుకుంటుందని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను రేవంత్ సర్కార్ నియంత్రించాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంలో రైతు జీవితం
### మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్ర ఆవిష్కరణ

తెలుగు సాహిత్యంలో రైతు జీవితాన్ని మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్రంగా ఆవిష్కరించారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమి, సృజన సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేరెడ్డి యాదగిరి రెడ్డి సాహిత్య సమాలోచన ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఆరు
దశాబ్దాలుగా నిబద్ధతతో అనేక పక్రియలలో మేరెడ్డి యాదగిరిరెడ్డి సాహిత్య సృజన చేశారని కొనియాడారు. ముఖ్యంగా కథా సాహిత్యంలో తెలంగాణ గ్రామీణ ప్లలెను గ్రామీణ జీవితాన్ని రైతుల జీవితాలను చక్కగా చిత్రించారన్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ.. మేరెడ్డి యాదగిరి రెడ్డి అట్టడుగు వర్గాల జీవితాలను సాహిత్య కాన్వాస్ పై ఆవిష్కరించారన్నారు. పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి మాట్లాడుతూ తెలుగు కథా సాహిత్యంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి తనదైన ముద్రవేశారన్నారు. నాలుగు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి కథలు రైతు జీవితం అనే అంశంపై ప్రసంగించారు. డా.పొట్టబత్తుల రామకృష్ణ మేరెడ్డి యాదగిరి రెడ్డి కవిత్వం అనే అంశంపై ప్రసంగించారు. డా.ఉప్పల పద్మ 'మేరెడ్డి యాదగిరిరెడ్డి బాలసాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ సి.అనిత కుమారి మేరెడ్డి మినీ కవిత్వం వస్తు శిల్పాలు అనే అంశంపై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పలువురు కవులు పాల్గొన్నారు.

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు
### కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి

తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటివరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

## అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు
### తాళం పగులగొట్టి సోదాలు చేశారని టిఎంసి ఆరోపణ

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు. భవానీపూర్‌లోని ఆయన నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి ఈడీ ఈ దాడులు జరిపినట్టు చెబుతున్నారు.


కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 14, 2026

# తెలంగాణాకు వర్ష హెచ్చరిక

**కరపత్రం బ్యూరో, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం వాతావరణం ఎంతో వైవిధ్యమైన పరిస్థితులను చూపిస్తోంది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వాతావరణ శాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఈరోజు మరియు రేపు (జూన్ 13, 14) ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, రంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో నల్గొండ జిల్లాలోని పులిచెర్లలో 11.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. అలాగే ముల్కచర్లలో 9.5 సెం.మీ, నాంపల్లిలో 8.2 సెం.మీ, మాటూరులో 7.9 సెం.మీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కూడా 7.9 సెం.మీ వర్షపాతం నమోదైంది.




**▪ నేడు ఈ జిల్లాలలో వర్షాలు**

నిజామాబాద్, జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో నేడు అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని చందానగర్, మియాపూర్, జేఎన్టీయూ, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, బోరబండ, నారాయణగూడ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వాన పడి రహదారులపై వరద నీరు నిలిచిపోయి ట్రాఫిక్ ఎక్కువ సమయం నిలిచిపోయింది.

**▪ రాబోయే రెండు రోజులు వర్షాలు**


వర్షాల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు వరద నీటిని తొలగించే పనులు చేపట్టాయి. గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు క్రమంగా తగ్గుతాయని అధికారులు అంచనా వేశారు. అయితే రుతుపవనాల ప్రభావం కారణంగా రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**▪ ఒకవైపు వర్షాలు.. మరోవైపు ఎండలు**

16 జిల్లాల్లోని సుమారు 63 మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో 42.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరికొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 42.7 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఈ వేడి గాలులు ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. రుతుపవనాల వల్ల వాతావరణం చల్లబడుతుందని ఆశించినవారికి ఈ మార్పులు ఆశాభంగాన్ని కలిగిస్తున్నాయి.

# రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి

- రక్తదానం చేయండి... మానవత్వాన్ని చాటండి
- టిఆర్ఎస్, వరంగల్ హనుమకొండ జిల్లాల ఇన్చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు




**తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూన్ 13**

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 14న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, గర్భిణీలు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తదానం ప్రాణాధారంగా నిలుస్తుందని తెలిపారు. ఒక యూనిట్ రక్తం పలువురికి జీవనాధారంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తూ, స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడటమే కాకుండా సమాజానికి సేవ చేసిన తృప్తి కూడా లభిస్తుందని అన్నారు. యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాల్లో పాల్గొని అవసరమైన వారికి అండగా నిలవాలని ఆయన కోరారు. "మన రక్తం మరొకరికి జీవం పోస్తుంది. రక్తదానం మహాదానం. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలి" అని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అన్నారు.

# నేరేడు పండు తిన్న వెంటనే తినకూడని ఆహార పదార్థాలు

**గజెల్లి రాజేంద్ర ప్రసాద్, సోషల్ అనలిస్ట్**



వేసవి చివరలో, తొలి వర్షాకాలంలో మార్కెట్‌లో ఎక్కువగా కనిపించే పండ్లలో నేరేడు పండు ఒకటి. దీనిని జామున్, జావా ప్లమ్ లేదా ఇండియన్ బ్లాక్‌బెర్రీ అని కూడా పిలుస్తారు. ఊదా రంగులో కనిపించే ఈ పండు రుచికి మాత్రమే కాదు, ఆరోగ్య ప్రయోజనాలకు కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి, జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారికి, రోగనిరోధక శక్తిని పెంచుకోవాలనుకునేవారికి నేరేడు పండు ఎంతో మేలు చేస్తుంది.


నేరేడు పండులో విటమిన్–జ, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరచి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. అయితే నేరేడు పండును తినేటప్పుడు కొన్ని ఆహారాలను వెంటనే తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

- మొదటగా, నేరేడు పండ్లు తిన్న వెంటనే ఊరగాయలు తినకూడదు. ఈ రెండింటిలోనూ ఆమ్ల గుణాలు ఎక్కువగా ఉండటంతో కడుపులో యాసిడ్ స్థాయి పెరిగి గుండెల్లో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావచ్చు. కనీసం గంటసేపు విరామం ఇచ్చిన తర్వాత మాత్రమే ఊరగాయలు లేదా పులుపు పదార్థాలు తీసుకోవడం మంచిది.
- అలాగే పసుపు ఎక్కువగా ఉండే ఆహారాలను కూడా వెంటనే తీసుకోవద్దు. పసుపు ఆరోగ్యానికి మేలు చేసినా, నేరేడు పండుతో కలిసి తీసుకున్నప్పుడు కొందరిలో కడుపులో చికాకు, వికారం లేదా జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల ఈ రెండింటి మధ్య కొంత సమయం గ్యాప్ ఉండటం మంచిది.
- తీపి పదార్థాలు, డీప్ ఫ్రైడ్ స్నాక్స్ కూడా నేరేడు పండుతో కలిపి తినకూడదు. నేరేడు పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. కానీ స్వీట్లు, వేయించిన ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీంతో కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు రావచ్చు.
- ఇక చివరిది..చాలామంది చేసే మరో పొరపాటు నేరేడు పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం. ఇలా చేయడం వల్ల కడుపులోని జీర్ణరసాలు పలుచబడతాయి. ఫలితంగా అజీర్ణం, కడుపు ఉబ్బరం, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే నేరేడు పండ్లు తిన్న తర్వాత కనీసం 30 నుంచి 45 నిమిషాల వరకు నీళ్లు తాగకపోవడం మంచిది.

మొత్తానికి నేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సూపర్‌ఫుడ్. అయితే దాని పూర్తి ప్రయోజనాలు పొందాలంటే సరైన సమయంలో, సరైన ఆహారాలతోనే తీసుకోవాలి. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే నేరేడు పండు వల్ల ఆరోగ్యానికి మరింత మేలు జరుగుతుంది.

# రక్తదానం చేయండి... జీవితాలను నిలబెట్టండి

- ప్రతి రక్తదాత సమాజానికి నిజమైన హీరో
- శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత డా. ముచ్చ రాజిరెడ్డి, కరస్పాండెంట్ ముచ్చ అరుణ రెడ్డి




**తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూన్ 14**

జూన్ 14న నిర్వహించే ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ ముచ్చ అరుణ రెడ్డి రక్తదాతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ.. సమాజంలోని ప్రతి అర్హుడైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, థలసేమియా, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తదానం ప్రాణాధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఒక యూనిట్ రక్తం పలువురి ప్రాణాలను కాపాడగలదని, రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. యువత, విద్యార్థులు, సామాజిక సేవా సంస్థలు రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, ఇది అత్యంత గొప్ప సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. "మన రక్తం మరొకరి గుండె చప్పుడు కొనసాగించే శక్తిని కలిగి ఉంటుంది. రక్తదానం చేయండి... జీవితాలను నిలబెట్టండి" అని డా. ముచ్చ రాజిరెడ్డి, ముచ్చ అరుణ రెడ్డి పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో అక్రమ నివాసం ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

- జీడిమెట్ల ప్రాంతంలోని గాజులరామారంలో అద్దె ఇంటిపై దాడులు
- ఎలాంటి పత్రాలు లేకుండా నివసిస్తున్న బంగ్లాదేశీయులు
- జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలింపు.



హైదరాబాద్‌లో అక్రమ వలసదారులపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జీడిమెట్ల ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ పౌరులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు గాజులరామారం హెచ్‌ఏఎల్ కాలనీలోని ఓ అద్దె ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ నివసిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వీరు ఉంటున్నట్లు గుర్తించారు.

తదుపరి న్యాయపరమైన చర్యల కోసం వారిని మెదక్ జిల్లా జోగిపేటలో ఉన్న డిపోర్టేషన్ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వారి భారత్ ప్రవేశం, నివాసం, ఇతర వివరాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. బెంగాల్ లోని సువేందు అధికారి ప్రభుత్వం అమలు చేస్తున్న 'గుర్తింపు--తొలగింపు--దేశ బహిష్కరణ' (Identify-Remove-Deport) విధానంలో భాగంగా అక్రమ వలసదారులపై చర్యలు మరింత కఠినతరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో కూడా అదే తరహా తనిఖీలు జరగడం గమనార్హం.

# గ్రామాల్లో మౌలిక వసతుల ధ్యేయమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- సీతంపేట గ్రామంలో వివో, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూన్ 13**

హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో వివో భవనం మరియు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంతో పాటు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాలు గ్రామ పాలనకు కేంద్ర బిందువులుగా, వివో భవనాలు గ్రామ ప్రజల సామాజిక అవసరాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్నామని చెప్పారు. సీతంపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళ సంఘాలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు....

# మద్యంలో వేల కోట్ల కుంభకోణం అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో

**– అభివృద్ధిని అడ్డుకుంటూ డైవర్షన్ పాలిటిక్స్**
**– తీవ్రంగా విమర్శలు గుప్పించిన మంత్రి కొల్లు రవీంద్ర**

మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం కేసు తాడేపల్లి ప్యాలెస్ గేటును తాకిందని మంత్రి ఆరోపించారు. గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తోంది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ శాశ్వతంగా కనుమరుగు కానుందని వ్యాఖ్యానించారు. మద్య నిషేధ హామీని తుంగలో తొక్కి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలను గొడ్డలి పార్టీ బలితీసుకుందని ధ్వజమెత్తారు. శనివారం అమరావతి వేదికగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. బాబాయి హంతకులను కాపాడుతూ, న్యాయం కోరిన సొంత చెల్లికే జగన్ వెన్నుపోటు పొడిచారని ఆగ్రహించారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ హామీలను అటకెక్కించి ఐదేళ్లలో 4,100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. జీఓ నంబర్ – 117 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి, 12 లక్షల మంది భవితను అంధకారం చేశారని దుయ్యబట్టారు. బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి కుదించి వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆగ్రహించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం స్థానాలతో కూటమికి చరిత్రాత్మక విజయం అందించి.. జగన్ అరాచక పాలనకు ఏపీ ప్రజలు స్వస్తి పలికారని ప్రస్తావించారు. గత ఐదేళ్ల విధ్వంసాన్ని తుడిచేస్తూ.. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో అద్భుతమైన సంక్షేమం, ప్రగతి పథంలో ప్రయాణిస్తోందని చెప్పుకొచ్చారు.

# తెలంగాణ ఉద్యమ పురస్కారంతో బస్కే రాజేందర్‌కు ఘన సన్మానం



**తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూన్ 13**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం – 2026 పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు బస్కే రాజేందర్‌ను "తెలంగాణ ఉద్యమ పురస్కార సన్మాన పత్రం"తో ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ నిర్వాహకులు శాలువా కప్పి సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యోధుల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని బస్కే రాజేందర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొని బస్కే రాజేందర్‌కు అభినందనలు తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 14, 2026

# రైతు భరోసా ఎక్కడ..? రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- వర్షాకాలం మొదలైనా నిధులు జమ చేయక రైతులను అప్పుల బాట పట్టిస్తోంది
- రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి --
- బీసీ, ఎస్సీ, ఎస్టీ అండ్ జేఏసీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేల్పుల చందు యాదవ్




**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, జూన్ 13:** వ్యవసాయానికి అత్యంత కీలకమైన వర్షాకాల సాగు సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ కాకపోవడం పట్ల హుజూరాబాద్ నియోజకవర్గ బీసీ, ఎస్సీ, ఎస్టీ అండ్ జేఏసీ ఇన్‌చార్జ్ వేల్పుల చందు యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉంటామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా నిరాశపరిచిందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాల్సిన కీలక దశలో ఉన్నారని, ఈ సమయంలో రైతు భరోసా నిధులు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, రైతులకు అందాల్సిన సహాయం అందకుండా పోవడం వల్ల రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోందన్నారు. రైతు భరోసా పేరుతో ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామాల్లో రైతులు బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేస్తూ సాగు పనులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తే, సాగు సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా నిధులు విడుదల చేసేదని అన్నారు. రైతులు పంటల సాగు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం మాత్రం కాలయాపన చేస్తూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతుల కష్టాలు, బాధలు ప్రభుత్వం గుర్తించకపోతే రాబోయే రోజుల్లో రైతు సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. రైతాంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పుకునే ప్రభుత్వం, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వేల్పుల చందు యాదవ్ కోరారు.

# ఇస్రోను సందర్శించిన ఖని విద్యార్థి రిశ్విక్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 13:** అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ నిర్వహించిన ప్రపంచ స్థాయి 'భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్'లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక తిలక్ నగర్ కు చెందిన రాకం శ్వేత–కిరణ్ దంపతుల కుమారుడు, స్థానిక కృష్ణవేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిశ్విక్ ఇస్రో సందర్శనకు ఎంపికై శుక్రవారం కర్ణాటక బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించాడు.



ఈ సందర్భంగా శేషాద్రిపురంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో తన తల్లిదండ్రులు, తమ్ముడు అయాన్ష్ తో కలిసి పాల్గొన్న రిశ్విక్ ను కార్యక్రమ ముఖ్య అతిథి, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ నేషనల్ టాపర్ మెడల్ తో పాటు మెమెంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రిశ్విక్ మాట్లాడుతూ తనను ఇస్రో సందర్శనకు ఎంపిక చేసిన ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇస్రోలో శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల నిర్మాణం తదితర అంశాలపై విలువైన సమాచారాన్ని అందించారని పేర్కొన్నాడు. ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ సోమనాథ్‌ను ప్రత్యక్షంగా కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపాడు. ఇస్రో సందర్శనకు తనను ప్రోత్సహించిన కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తన తల్లిదండ్రులకు రిశ్విక్ కృతజ్ఞతలు తెలిపాడు.

# మోడీ స్వచ్ఛత మంత్రంతో కదిలిన బీజేపీ శ్రేణులు

- జమ్మికుంట గర్ల్స్ హైస్కూల్‌లో భారీ పరిశుభ్రత కార్యక్రమం -- శ్రమదానం చేసిన బీజేపీ నాయకులు





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 13:** దేశాన్ని పరిశుభ్రమైన భారతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బీజేపీ నాయకులు స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "స్వచ్ఛ పాఠశాల -- స్వచ్ఛ భారతం" అనే సంకల్పంతో శనివారం పట్టణంలోని 23వ వార్డులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (గర్ల్స్ హై స్కూల్)లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మొక్కల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదుల పరిసర ప్రాంతాలు, డ్రైనేజీ ప్రాంతాలను శుభ్రం చేసి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థినులు ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన స్వచ్ఛ భారత్ అభియాన్ లక్ష్యాలను గ్రామాలు, పట్టణాల స్థాయిలో విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెరగడంతో పాటు క్రమశిక్షణ, బాధ్యతాయుత భావన కూడా పెంపొందుతుందని తెలిపారు. చిన్నారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం వైపు నడిపించవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, చెత్తను వేర్వేరుగా సేకరించి సరైన విధంగా పారవేసే చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిశుభ్రత మరింత అవసరమని నాయకులు వివరించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాల పరిశుభ్రతను కాపాడాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కోరారు. పరిశుభ్రమైన పాఠశాలలు విద్యార్థుల్లో సానుకూల ఆలోచనలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, ఠాకూర్ రాజేష్, రాకేష్, యంసాని సమ్మయ్య. కోరే రవీందర్ సమ్మయ్య ఉడుగుల మహేందర్, పత్తి జనార్ధన్ రెడ్డి, మోడెం రాజు, శరత్‌తో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వారు స్వయంగా శ్రమదానం చేసి పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా నాయకులు మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ లక్ష్య సాధన కోసం భవిష్యత్తులో కూడా పాఠశాలలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని వెల్లడించారు. సమాజ అభివృద్ధికి పరిశుభ్రతే మొదటి మెట్టు అని, ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# నందిగామలో ఘనంగా సింగినేని మధునయ్య--వెంకటమ్మ దంపతుల శష్టిపూర్తి వేడుక



**కరపత్రం ప్రతినిధి జయశంకర్ జిల్లా. భూపాలపల్లి మండలం నందిగామ.జూన్ 13**

భూపాలపల్లి మండలం, నందిగామ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం నందిగామ గ్రామంలో సింగినేని మధునయ్య--వెంకటమ్మ దంపతుల శష్టిపూర్తి వేడుకను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాదాడి రంజిత్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఇటుకాల రవి, బీఆర్ఎస్ నాయకులు లింగమల్ల బోసు,మాజీ ఉపసర్పంచ్ తైనేని రవి, గాజుల రాజబాబు .ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనిపథకం స్థలంలో వేదపండితుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సింగినేని మధునయ్య--వెంకటమ్మ దంపతులు 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తమ సొంత ఖర్చులతో ఈ శుభకార్యాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్న దంపతులు శష్టిపూర్తి వేడుకను తప్పనిసరిగా జరుపుకోవాల్సిన ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు శఠగోపం ఆశీర్వాదం, ఉపసర్పంచ్ తైనేని లక్ష్మన్, ఇంచార్జ్ సర్పంచ్ లావుడ్య రాధిక--రవి, తైనేని సమ్మయ్య, తైనేని శ్రీరాం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# తిప్పాపూర్ లో బోరుబావికి భూమి పూజ

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధుల నుంచి మంజూరైన బోరుబావికి పూజా కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, 8వ వార్డు కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న తాగునీటి ఎద్దడిని ఎంపీ బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి, బోరుబావిని మంజూరు చేయడం జరిగిందని, అలాగే పట్టణంలో ఎనిమిది బోరుబావులు వేయించేందుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ వారంలోనే అన్ని ఎనిమిది బోరుబావులకు మోటార్లు అమర్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి కొంత మేర ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ ఎలా శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు ప్రసాద్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వివేక్ రెడ్డి, నేరెళ్ల సాయి,జగన్నాథం, శ్రీనివాస్, నేరెళ్ల కిరణ్ కుమార్, మొక్సిత్, శివసాయి,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# "మన బడి -- మన బాధ్యత"తో కనగర్తిలో సేవా సందడి

- ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రతకు బీజేపీ నాయకుల శ్రమదానం --
- విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : మట్ట పవన్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూన్ 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి, సేవా సుపరిపాలన దిశగా పయనిస్తున్న నేపథ్యంలో ఆయన పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు గ్రామస్థాయిలో విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "మన బడి -- మన బాధ్యత" కార్యక్రమం ఇల్లందకుంట మండల కేంద్రంలోని కనగర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వయంగా శ్రమదానం చేసి పాఠశాల ఆవరణను పరిశుభ్రపరిచారు. పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, తరగతి గదులు, ప్రహరీ పరిసరాలు, మొక్కల ప్రాంతాలను శుభ్రం చేశారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా ఆలయాలని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, తల్లిదండ్రులు, యువత కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ బోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, తమ పిల్లలను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే సమాన విద్యా అవకాశాలు ప్రతి విద్యార్థికి అందుతాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్, బేటీ బచావో -- బేటీ పడావో, డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వాటి స్ఫూర్తితోనే బీజేపీ నాయకులు గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే గత విద్యా సంవత్సరంలో విజయవంతంగా నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించనున్నట్లు మట్ట పవన్ రెడ్డి వెల్లడించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్లమెంట్ వ్యాప్తంగా ఒకే రోజు సైకిళ్ల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యతో పాటు పరిశుభ్రత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడం కూడా అత్యంత అవసరమని అన్నారు. "మన బడి -- మన బాధ్యత" కార్యక్రమం ద్వారా పాఠశాలల పట్ల గ్రామ ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యమని వివరించారు. దేశ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చూపిస్తున్న సేవా భావం, సుపరిపాలన, పారదర్శకత స్ఫూర్తితో బీజేపీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువవుతూ సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాయని మట్ట పవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, బండి సాంబరాజు, బచ్చల రాజమహేందర్, కంచం రాజయ్య, మట్ట అరవింద్ రెడ్డి, మాడిజోడి రవి, సామాను రామారావు, మల్లయ్యతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మోదీ ప్రధాని పదవికి 12 ఏళ్లు పూర్తి..

అంబేద్కర్ నగర్ పాఠశాలలో స్వచ్ఛ భారత్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాని పదవిలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శనివారం బిజెపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణను శుభ్రపరిచి, పాఠశాల భవనానికి కొత్తగా రంగులు వేయించారు. విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా పాఠశాల పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన స్వచ్ఛ భారత్ ఉద్యమం దేశవ్యాప్తంగా పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిందన్నారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, వంగల శ్రీనివాస్, శ్రీధర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.